క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ కేటీఆర్ కాలనీ ఫీడర్, 11కేవీ గోకరాజు రంగరాజు ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాలాజీ కాలనీ, వెంకట్రాయనగర్ కాలనీ, వినాయకనగర్, న్యూ శ్రీనివాస కాలనీ, కేటీఆర్ కాలనీ, జేఎన్‌యూఆర్‌ఎం ఫేజ్–1, 2లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిజాంపేట్: విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ప్రగతినగర్ సబ్‌స్టేషన్ ఏఈ డేగ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ రాజీవ్‌గృహకల్ప ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాసవీ లేఅవుట్, విజేత సూపర్ మార్కెట్ వెనుక గల్లీ, ప్రగతి స్కూల్ పరిసర ప్రాంతాల్లో.. 11 కేవీ పంచవటి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గోదావరి కట్స్, సాయికీర్తి లేఅవుట్, రోసరీ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

30న మల్లికార్జున స్వామి కల్యాణం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు స్వామి, అమ్మవార్లను గంగకు తీసుకెళ్లడం, 30న మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణం, బోనాలు, గొలుసు తెంపుట, అగ్నిగుండం దాటుట, రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఒగ్గు కథ, 31న ఉదయం నాగవెల్లి తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బాధ్యతల స్వీకరణ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పీర్జాదిగూడ కమిషనర్‌గా పని చేస్తున్న రామకృష్ణారావు అదనపు బాధ్యతలు స్వీకరించారు. నిజాంపేట్ కమిషనర్ వంశీకృష్ణ వ్యక్తి గత కారణాలతో ఫిబ్రవరి 8 వరకు సెలవుపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టారు.

కోవిడ్ కేసులు నిల్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 19 మందికి టెస్టులు చేయగా అందరికీ నెగిటివ్ వచ్చిందని వైద్యాధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యానికేతన్ విద్యార్థి



కుషీబాబా రూపొందించిన మినీ వెంటిలేటర్

కుత్బుల్లాపూర్: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎస్.ఆర్.నాయక్‌నగర్‌కు చెందిన సత్యవాణి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి కుషీబాబా మినీ వెంటిలేటర్ నమూనా రూపొందించగా డీఈవో విజయలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడిని రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేయడంతో మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ కోటిరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ రవిసూర, డైరెక్టర్ దీప్తిరెడ్డి అభినందించారు.

ఎమ్‌ఆర్‌సెట్‌లో ఫ్రెషర్స్ డే

సుభాష్‌నగర్: విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకుని సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఎమ్‌ఆర్‌సెట్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వీ.ఎస్.కె.రెడ్డి అన్నారు. మంగళవారం మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎమ్‌ఆర్‌సెట్)లో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

మారని 'నిషా' చోదకులు

- 2022 సంవత్సరంలో రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9,603 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- నిత్యం అవగాహన కల్పిస్తున్నా వాహనదారుల్లో మార్పురాని వైనం



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా కొందరిలో మార్పు రావడం లేదు. పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలతో కొంతమందిలో మార్పు వస్తున్నా, మరి కొంతమందిలో ఎలాంటి మార్పు రావడం లేదు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కుతున్నారు. 2022 సంవత్సరంలో జీడిమెట్ల, అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏకంగా 9,603 కేసులు నమోదయ్యాయి.

- అల్వాల్ ట్రాఫిక్ సీఐ రాజు నేతృత్వంలో 2022లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మొత్తం 5906 కేసులు నమోదయ్యాయి. ఇందులో 3903 మంది లైసెన్స్ రద్దు చేయమని మేడ్చల్ ఆర్టీవో కార్యాలయానికి ప్రతిపాదించారు. 413 మంది రెండుసార్లు మద్యం తాగి ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడ్డారు. ఒకవైపు జాతీయ రహదారి మరోవైపు రాజీవ్‌ రహదారికి అనుసంధానంగా ఉన్న అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ప్రతిరోజూ సుచిత్ర, అల్వాల్ వెల్లో రోడ్డు, కొంపల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఈ కేసులను నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.
- జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, చింతల్, ఐడీపీఎల్, జగద్గిరిగుట్ట రోడ్డు ఇలా అనేక ప్రాంతాల్లో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం ద్వారా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 3697 పట్టుబడ్డారు. వారిలో 2475 లైసెన్స్‌లను రద్దు చేయించారు. 325 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ రెండుసార్లు పట్టుబడ్డారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



తాగి వాహనాలు నడపడం గొప్ప విషయం కాదు. మద్యం తాగి వాహనాలు నడపడం అంటే జీవితాన్ని నాశనం చేసుకుంటున్నట్లే. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తించాలి. తాగి వాహనం నడిపితే మనతో పాటు ఎదురుగా వచ్చే వారు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

–కర్రె చంద్రశేఖర్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ

ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

- వేములవాడ రాజన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న గౌడ కల్యాణమండపం, వసతి గృహాల నిర్మాణానికి సహాయం అందిస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం తన నివాసానికి విచ్చేసిన కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, మాజీ కార్పొరేటర్ దాస్‌గౌడ్‌లకు ఆయన రూ.25 లక్షల విరాళం అందజేశారు.
- జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. బస్తీ అభివృద్ధికి సహకరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏసు, వార్డు మెంబర్ ఇందిరారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.
- సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో ఫోర్‌లేన్ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేను సుభాష్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అడప శేషు ఆధ్వర్యంలో కాలనీ వాసులు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీవాసులు కటింగ్ శ్రీనివాస్, ప్రసాద్, నర్సింగ్, కొండన్న, సంతోష్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ రాజు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.
- నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరువ్యాపారుల జీవనోపాధి, క్రమబద్ధీకరణ చట్టం 2014 ప్రకారం వెండింగ్ జోన్, వెండింగ్ సర్టిఫికెట్లు అందజేయాలని, ఐడీపీఎల్ జంక్షన్ అభివృద్ధిలో భాగంగా జీవనోపాధి కోల్పోయిన స్ట్రీట్ వెండర్లను ఆదుకోవాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగ శాలివన్, జనరల్ సెక్రటరీ అలివేలు మంగ, ఈసీ మెంబర్ పోచమ్మ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన అయోధ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

ఎంపీ రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేత



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో సూరారం కాలనీకి చెందిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించాలని కోరగా రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కాంగ్రెస్ నాయకులు సంగం వీరేష్‌గుప్తా, గణేష్, శ్రీశైలంయాదవ్, ఆల్ ఇండియా దళితసేన అధ్యక్షుడు జేమ్స్, అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవయ్య పాల్గొన్నారు.

నేడు, రేపు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో టీవీఆర్ మోడల్ హైస్కూల్ సౌజన్యంతో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోటీలు జరుగుతాయి. ఔత్సాహికులు ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యత ఉంటుంది. ఉత్తమ ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సలేషన్ బహుమతులు ఉంటాయి. వివరాలకు 7993839360 నెంబరులో సంప్రదించాలి.

రేపు సత్‌జ్ఞాన్ స్కూల్‌లో..

జీడిమెట్ల డివిజన్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో ఈ నెల 12(గురువారం) సాక్షి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోటీలు ఉంటాయని, ఔత్సాహికులు ఉదయం 9.30 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

రోడ్లను ఆక్రమిస్తే ఉపేక్షించం



నిజాంపేట్ మెయిన్ రోడ్డులో జేసీబీతో ర్యాంప్‌లను తొలగిస్తున్న దృశ్యం

నిజాంపేట్: రోడ్ల ఆక్రమణలపై నిజాంపేట్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరఢా ఝుళిపించారు. మంగళవారం నిజాంపేట్ ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన పలు దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ర్యాంప్‌లు, మెట్లను టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీతో తొలగించారు. రోడ్డుపై రాకపోకలకు ఆటంకంగా మారిన ఆక్రమణలను ఉపేక్షించేది లేదని, ఎవరైనా రోడ్లపైకి జరిగి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాల తొలగింపు



డబ్బాలను తొలగిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ శివాలయనగర్‌ను ఆనుకుని ఉన్న గాజులరామారం సర్వే నంబర్ 49/6 దిల్ సంస్థ స్థలంలో వెలిసిన డబ్బాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇప్పటికే 70% మేర దిల్ సంస్థ స్థలం కబ్జాకు గురికాగా మిగిలిన స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేయడంపై బీజేపీ ఆందోళనకు దిగింది. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం ఆ డబ్బాలను క్రేన్ సహాయంతో తొలగించారు.

నేడు జర్నలిస్ట్‌లకు ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్: దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో బుధవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజుగౌడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ శిబిరంలో ఈసీజీ, 2డీ ఎకో, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఎండోస్కోపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్‌ల కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృషి కాలనీలో..

మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. కృషి కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయం, భాగ్యలక్ష్మి కమ్యూనిటీహాల్ వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని బీఆర్ఎస్‌కేవీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పోరస్ లేబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కార్మికులకు 2023 సంవత్సరానికి గాను యాజమాన్యం చేత 20 శాతం బోనస్, గుడ్‌విల్ కింద ప్రతి కార్మికుడికి రూ.75 వేలు ఇప్పించారు. వైజాగ్ యూనిట్‌లో సర్వీసు మీద బదిలీ అయిన ఆరుగురు కార్మికులకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులకు ఒక్కొక్కరికి రూ.6వేలు ఇచ్చేలా ఒప్పించారు. దీంతో మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో మదన్‌గౌడ్‌ను కార్మికులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్ఎస్‌కేవీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు, సుభాష్, కార్మికులు పాల్గొన్నారు.



మదన్‌గౌడ్‌ను సత్కరించిన కార్మికులు

వనిత కళాశాలలో ట్రెడిషనల్ డే

చింతల్: చింతల్‌లోని వనిత మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ట్రెడిషనల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె.నరేష్, కరస్పాండెంట్ లావణ్య, డైరెక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల సిబ్బంది

ఘనంగా లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు



లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బస్తీ వాసులు

చింతల్: కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన నివాసంలో నిర్వహించారు. అభిమానులు, పార్టీ నాయకులు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కృషి చేశానన్నారు. భగత్ సింగ్‌నగర్ మోడ్రన్ ఫంక్షన్ హాలు వద్ద గతంలో తొలగించిన కాలనీ వ్యవస్థాపకుడు పెంచల్‌రెడ్డి, భగత్‌సింగ్ విగ్రహాలను తిరిగి ప్రతిష్ఠిస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలివ్వాలి'

రంగారెడ్డినగర్: వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని చెబుతూ డ్వాక్రా మహిళల వద్ద రాష్ట్ర ప్రభుత్వం అధిక వడ్డీ వసూలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతను కలిసి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో 4800 డ్వాక్రా గ్రూపులు ఉండగా వడ్డీ లేని రుణాలు ఇవ్వని కారణంగా 1300 గ్రూపులు కనుమరుగయ్యాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చేతకానితనం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, వడ్డీ లేని రుణాలు ఇవ్వకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గరిగె శేఖర్‌ముదిరాజ్, జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అరికెల సుధా, మహిళా మోర్చా నాయకులు అరుణరెడ్డి, అలివేలు, పూలమ్మ, వసుంధర, రాజమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రేష్మ

జగద్గిరిగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేసే సుధీర్, ప్రైవేట్ ఉద్యోగం చేసే అతడి పిన్ని కూతురు రేష్మా(23) గత ఐదు నెలలుగా ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ నెల 8న ఉదయం 9.30 గంటలకు తన స్నేహితురాలిని కలిసి వస్తానని చెప్పి వెళ్లిన రేష్మా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టు పక్కల, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకి తెలియకపోవడంతో మంగళవారం సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: భార్యాపిల్లలపై బెంగతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్లం మణిబాబు(34) 5 నెలల క్రితం నగరానికి వచ్చి గండిమైసమ్మలోని ఓ హాస్టల్‌లో ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. భార్యా పిల్లలు దూరంగా సొంత ఊళ్లో ఉండడంతో ఈ విషయమై సికింద్రాబాద్‌లో ఉండే తన బావమరిది ఉదయ్‌కుమార్‌తో తరచూ ఫోన్‌లో మాట్లాడి బాధ పడేవాడు. ఈ నెల 9వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మణిబాబు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మహిళ అదృశ్యం

కుత్బుల్లాపూర్: డ్యూటీకి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దత్తాత్రేయనగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసముండే కార్పెంటర్ ఎస్.కె.ఫయాజ్, హఫ్సినా(30) భార్యాభర్తలు. ఈ నెల 6వ తేదీ ఉదయం 8.30 గంటలకు సుభాష్‌నగర్‌లోని ఓ పరిశ్రమలో డ్యూటీకి వెళ్లిన హఫ్సినా రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన భర్త ఆమె కోసం పరిశ్రమ వద్ద వాకబు చేయగా డ్యూటీకి రాలేదని చెప్పడంతో ఆమె కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చిత్తారమ్మదేవి జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్



చిత్తారమ్మ జాతరలో జనసందోహం(ఫైల్)



ఆలయంలో కొలువైన చిత్తారమ్మదేవి

సుభాష్‌నగర్: నగరంలో ఉజ్జయినీ మహంకాళి జాతర తర్వాత అతిపెద్ద జాతర గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతర. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు జరిగే అమ్మవారి జాతరకు భారీ ఏర్పాట్లు చేయనున్నారు. 22న జరిగే ప్రధాన జాతర ఏర్పాట్ల విషయమై మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే వివేకానంద్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా పెరుగుతున్న భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, ఆరోగ్య, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్, విద్యుత్, రోడ్లు, పరిశుభ్రత, టాయిలెట్స్, అంబులెన్స్, ఫైర్ ఇంజిన్, తాగునీరు, ప్రత్యేక బస్సులు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ట్రాఫిక్ మళ్లింపు..

జాతర నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా షాపూర్‌నగర్–గాజులరామారం ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, షాపూర్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే వాహనాలను గాజులరామారం చౌరస్తా, ఉషాముళ్లపూడి హాస్పిటల్, మెట్టికానిగూడ, జగద్గిరిగుట్ట మీదుగా మళ్లించనున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నగరంలో ప్రఖ్యాతిగాంచిన చిత్తారమ్మ దేవి జాతరకు చాలా విశిష్టత ఉంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఏటా మాదిరిగానే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. కరోనా నేపథ్యంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం



జాతర కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం. మహిళా భక్తులను దష్టిలో పెట్టుకొని 60 మంది మహిళా పోలీసులను నియమిస్తాం. ఆలయ కమిటీ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పోకిరీలు, చైన్‌స్నాచర్లపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

– గంగారామ్, ఏసీపీ, బాలానగర్

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



జాతర సందర్భంగా వారం రోజుల ముందుగానే పనులు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– కూన అంతయ్యగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్